క్లుప్తంగా

లో వోల్టేజీ నివారణకు మినీ ట్రాన్స్‌ఫార్మర్



రాంనగర్‌లో ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామ పరిధిలోని రాంనగర్‌లో సర్పంచ్ పల్లె ప్రతిమ ఆదివారం మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. కొన్నిరోజుల నుంచి రాంనగర్ లో వోల్టేజి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. ఈ మేరకు సర్పంచ్ మంథని ఏడీఏ హేమచంద్ర దృష్టికి తీసుకెళ్లి రాంనగర్‌లో 15 కేవీ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. పీ.వీ.రావు, కుంట చక్రి, చిట్టవేన రాజేశం, కొండం శ్రీనివాస్, బెజ్జాల ఓదెలు, జేఎల్ఎం రమేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్ నగర్‌లోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ, హనుమాన్ దీక్ష సేవా సమితి సభ్యులు, హనుమాన్ దీక్షస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వలలో రామభక్త ప్రసన్నాంజనేయ గణేశ్ నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని టీచర్స్ కాలనీలోని ఇండియన్ మిషన్ స్కూల్ ముందు కాసనగొట్టు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రామభక్త శ్రీభక్తాంజనేయస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమాన్ భగవత్ ధ్వజావిష్కరణలో బీజేపీ నాయకులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

హిందూ ఏక్తాయాత్రకు తరలిన నాయకులు



ఏక్తాయాత్రకు వెళ్తున్న నాయకులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లోని బీజేపీ నాయకులు, ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పుల మహేశ్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హిందూ ఏక్తాయాత్రలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఖమ్మం సతీశ్, మహిపాల్‌రెడ్డి, కొమ్మ ఐలయ్య, రాజు, మనోజ్‌రెడ్డి, ప్రసాద్, పొన్నం వెంకటేశ్, సంతోష్, అభిలాష్, స్వామి ఉన్నారు.

తురాయి పూలు.. ప్రకృతి శోభితం



రోడ్డుకు ఇరువైపులా తురాయి చెట్లు

కాల్వశ్రీరాంపూర్: మండలంలో తురాయి చెట్లు ఎర్రటి పూలతో శోభాయమానంగా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వేసవి కాలంలో పూచే ఈ తురాయి చెట్లు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులు, వాహనదారులు, బాటసారులు తురాయి చెట్లతో సెల్ఫీ దిగుతున్నారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాకు చెందిన ఇస్లావత్ విజయ్–సుజాత దంపతుల కూతురు కుమార్తె వైష్ణవి వివాహానికి సర్పంచ్ బదావత్ రాజునాయక్ రూ.10వేలు అందజేశారు. ఉపసర్పంచ్ ఇస్లావత్ తిరుపతినాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

మంథని: మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన పల్ల శ్రీనివాస్ అనే నిరుపేదకు మంత్రపురి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దాసరి కోటయ్య పెళ్లిబట్టలు, వంట సామగ్రి అందించారు. ట్రస్టు సంయుక్త కార్యదర్శి అల్లం తిరుపతి, సభ్యుడు దుబ్బాక ఓదెలు, మాచిడి శంకర్ ఉన్నారు.

పంట పరిహారం అందేదెన్నడు?

- అకాల వర్షాలకు 9,647 ఎకరాల్లో పంట నష్టం
- 5500 మంది రైతుల ఎదురుచూపులు
- పరిహారం అందించాలని వినతి
- జిల్లాలోనే ఎలిగేడు మండలంలో అధిక నష్టం



వడగండ్ల వానకు నేలవాలిన వరి (ఫైల్)

ఎలిగేడు: గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో వరితోపాటు ఇతర పంటలు సాగు చేసిన అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 6వేల మంది రైతులు 13,800 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలు సాగు చేశారు. గత మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల, వడగండ్ల వానలకు వరిపంట నేలవాలడంతోపాటు వరిగింజలు నేలరాలాయి. మొక్కజొన్న కంకి పాలు పోసేదశలో పంటలు నేలవాలి అపారనష్టం వాటిల్లింది. మామిడికాయలు రాలిపోయాయి. కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి.

జిల్లాలో ఎలిగేడులోనే ఎక్కువ నష్టం..

మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు పెద్దపల్లి జిల్లాలోనే ఎలిగేడు మండలంలో ఎక్కువ పంటనష్టం జరిగినట్లు వ్యసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పంటనష్టానికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఎలిగేడు మండలంలో 5500 మంది రైతులకు చెందిన సుమారు 9647 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లగా అందులో 9347 ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నంది. 200ఎకరాల్లో మొక్కజొన్న, 100 ఎకరాల్లో మామిడి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

గ్రామాల, రైతు వారిగా సర్వే పూర్తి..

ఆన్‌లైన్‌లో నమోదు..

మార్చి, ఏప్రిల్‌లో కురిసిన ఈదురుగాలులు, వడగండ్ల వానలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసి మొదటి, రెండు విడతలలో గ్రామాల, రైతుల వారీగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి పంటనష్టంపై సమగ్ర సర్వే చేశారు. మార్చిలో 2105 మంది రైతులకు చెందిన సుమారు 4700 ఎకరాల్లో నష్టం వాటిల్లగా ఏప్రిల్‌లో కురిసిన వడగండ్ల వర్షాలకు సుమారు 3900 మంది రైతులకు చెందిన 5వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. పంటనష్టం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..

గత మార్చిలో వచ్చిన వడగండ్ల వానలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్ నష్టపోయిన పంటలను పరిశీలించి ఎకరాలకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని రైతులు ఆధైర్యపడవద్దని ప్రకటించారు. సీఎం పర్యటన అనంతరం ఏప్రిల్లో మాసంలో మరోసారి వడగండ్ల వానలకు అపార నష్టం వాటిల్లింది. ఏప్రిల్‌లోజరిగిన పంటలకు సైతం పరిహారం అందజేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. సీఎం పరిహారం అందజేస్తామని రెండు నెలలు గడిచినా నేటి వరకు ఎలాంటి పరిహారం అందలేదని, పంటనష్టంకు పరిహారం ఆలస్యం చేయకుండా త్వరితగతిన అందజేసి రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేశాం



ఎలిగేడు మండలంలో గత మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల, వడగండ్ల వానలకు మండలంలో 9647 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలకు నష్టం జరిగింది. నష్టం వివరాలను గ్రామాల, రైతు వారీగా సర్వేచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. పరిహారం ప్రభుత్వం అందిస్తుంది.
– ఎం.ఉమాపతి, మండల వ్యవసాయ అధికారి

పంట పూర్తిగా దెబ్బతింది



మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. వడగండ్ల వానలకు పంట పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం ఎకరాకు రూ.10వేలు అందించి రైతులను ఆదుకోవాలి.
– అక్కెపల్లి శంకరయ్య రైతు, ధూళికట్ట

రైతులను ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో వరిసాగు చేస్తే వడగండ్ల వర్షాలు దెబ్బతీశాయి. ధ్వంసమైన పంటలను చూసి ఏడ్చినం. చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందించడంలో ఆలస్యం జరుగుతోంది. వెంటనే పరిహారం అందించాలి.
– బౌతు నారాయణ, రైతు, నేతకానిపల్లి

వైభవంగా హనుమాన్ జయంతి



సుల్తానాబాద్: సుద్దాలలో హోమం



కాల్వశ్రీరాంపూర్‌లో..



కమాన్‌పూర్: గుండారం హనుమాన్ ఆలయంలో



పాలకుర్తి: జీడీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో



ఎలిగేడు: నర్సాపూర్‌లో విగ్రహావిష్కరణ



రామగుండం: భజనలో మాలధారులు

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: పట్టణంలోని పెరిగిద్దె హనుమాన్ ఆలయంలో, మండలంలోని చిన్నకల్వల, సుద్దాల, కనుకుల, గట్టెపల్లి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు.

నర్సాపూర్‌లో హనుమాన్ విగ్రహావిష్కరణ

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ్ల సంతోష్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ తంగెళ్ల స్వప్నకుమార్, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి నిర్వహించారు. జీడీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో సర్పంచ్ సూర సమ్మయ్య దంపతులు హోమంలో పాల్గొన్నారు.

రామగుండంలో..

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి నిర్వహించారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్, వడ్కాపూర్, వెంకట్రావుపల్లె, కుమ్మరికుంట, పెద్దాపూర్ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగపేటలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, రాయపేటలో జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి హోమంలో పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు.

1098కు ఫిర్యాదు.. బాల్యవివాహాల నిలిపివేత



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఆర్యవైశ్యభవన్‌లో, మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయంటూ 1098కు అందిన ఫిర్యాదు మేరకు సంబంధితశాఖల అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి బాల్యవివాహాలు నిలిపివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో బాల్యవివాహం జరుగుతుందోంటూ ఫిర్యాదు రావడంతో పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్‌బాలికను చైల్డ్‌వెల్ఫేర్ సభ్యులు శ్రీధర్, సుమలత సఖి సెంటర్‌కు తరలించారు. సూపర్‌వైజర్ పుష్పవతి, చైల్డ్‌లైన్ సిబ్బంది బుచ్చిబాబు, రమాదేవి ఉన్నారు. అలాగే పెద్దపల్లిలోని ఆర్యవైశ్యభవన్‌లో జరిగిన బాల్యవివాహానికి సంబంధించి ఫిర్యాదు అందగా ఎస్సై మహేందర్ వెళ్లి పెళ్లిని నిలిపివేశారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి చైర్‌పర్సన్ శ్రీధర్, సమలత బాలికను సఖి సెంటర్‌కు తరలించారు. ప్రమీల, రేఖ ఉన్నారు.

నేటి నుంచే క్రీడల పండగ

జూలపల్లి: మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు సీఎం కప్ పేరుతో నిర్వహించే క్రీడాపోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన క్రీడల ఆటల పోటీలు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 15, 16, 17వ తేదీల్లో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 18 నుంచి 36ఏళ్ల లోపు యువకులు వాలీబాల్, ఖోఖో, పరుగు పందెం, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు పేర్కొన్నారు.

‘దుద్దిళ్ల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు’



మాట్లాడుతున్న నాయకులు

మంథని: అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు దుద్దిళ్ల కుటుంబంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ మంథని మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ శశిభూషణ్ కాచే అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే సంకల్పంతోనే నాడు స్వర్గీయ శ్రీపాదరావు మొదలు, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు నియోజకవర్గంలో అనేక పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పిన ఘనత ఉందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశిస్తే జిల్లాలో ఎందుకు అమలు కావడం లేదని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పోలు శివ, ఒడ్నాల శ్రీనివాస్, ముస్కు ల సురేందర్‌రెడ్డి, గోటికార్ కిషన్, రావికంటి సతీశ్, అజీంఖాన్, మంథని సురేశ్ తదితరులు ఉన్నారు.

అమ్మజోల పాట సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖనిటౌన్: అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్థానిక సింగరేణి స్టేడియంలో అమ్మజోల పాట సీడీని ఆవిష్కరించారు. కళాకారుడు మాట్ల తిరుపతి రచన, గానంతో ఈ పాట నిర్మించారు. రామగుండం డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, నాయకులు మురళీధర్‌రావు, దొంత శ్రీనివాస్, జేవీ రాజు, వంగ శ్రీనివాస్‌గౌడ్, గౌస్ పాషా, చెలుకలపల్లి శ్రీనివాస్, పీచర శ్రీనివాసరావు, పర్లపెల్లి రవి పాల్గొన్నారు.

‘నానేస్తం’ ట్రస్టు సేవలు అభినందనీయం



బాడీ ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, సర్పంచ్, నానేస్తం ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: నానేస్తం చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు మరువలేనివని, ప్రతి ఒక్కరికీ గుర్తుండేలా, ప్రజలకు ఉపయోగపడేలా ఉండడం అభినందనీయమని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక రాయనర్సయ్య, సర్పంచ్ భూర్ల సింధూజ కొనియాడారు. నానేస్తం చారిటబల్ ట్రస్టు, ఎలిగేడు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎలిగేడు ప్రజల అవసరార్థం కట్ల వెంకటరాజం జ్ఞాపకార్థం వారి కుమారులు అందజేసిన బాడీ ఫ్రీజర్‌ను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి అందజేయగా ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, ట్రస్టు అధ్యక్షుడు పెంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంగళదాస్ అశోక్, పూర్వ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు, నానేస్తం ట్రస్టు సభ్యులు భూర్ల వెంకటేశ్వర్లు, తానిపర్తి సుధాకర్‌రావు, బొంగోని శ్రీనివాస్, శ్రీనివాసరావు, వంగ సత్యనారాయణ, అశోక్, వీరస్వామి, ప్రకాష్, భూసారపు శ్రీనివాస్, రంగు రాములుగౌడ్, వీరగోని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవం



సన్మానిస్తున్న సురేందర్



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ధర్మారం: మండల కేంద్రంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని అలయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు తోట ఎల్లమ్మ, దేవి శాంతమ్మ, తోట సుగుణమ్మ, కొత్త సరితను సన్మానించారు. క్లబ్ కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి మహేందర్, పీఆర్‌వో బైరి చంద్రమౌళి, శివపాటిల్, సాయి, సింగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం పాల్గొన్నారు.

అనాథాశ్రమ నిర్వాహకురాలికి సన్మానం

గోదావరిఖనిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ పిల్లల ఆశ్రమ నిర్వాహకురాలు భూలక్ష్మిని మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు దేవీ లక్ష్మీనర్సయ్య సన్మానించారు.



సత్కరిస్తున్న భానుచందర్

అమ్మకు సత్కారం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎఫ్‌సిఐఎల్కలపల్లి గేట్ గ్రామపంచాయతీలో మదర్స్ డే సందర్భంగా ఆదివారం యువ నాయకుడు భానుచందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వనిత, ఆశా వర్కర్ స్వరూప, శానిటరీ వర్కర్ విజయకు శాలువాతో సన్మానించారు. పాస్టర్ మదర్ దయామణి, కొమురయ్య మారేపల్లి రవి పాల్గొన్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



అంతర్గత వీధిలో డ్రైనేజీ దుస్థితి

- ఇక్కట్లకు గురవుతున్న ప్రజలు
- పలు కాలనీల్లో ఇదే దుస్థితి
- అంతర్గత డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్

రామగుండం: వివిధ కాలనీల నుంచి వెలువడే డ్రైనేజీ నీరు నేరుగా రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిపైకి చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాంప్లెక్స్ నుంచి భరత్‌నగర్, శివాజీనగర్ వరకు డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరుతోంది. కొన్నేళ్లుగా ప్రధాన డ్రైనేజీ నిర్మాణం హామీగానే మిగిలిపోతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రైల్వేస్టేషన్ వరకు మధ్యలో డివైడర్ నిర్మాణం చేపట్టి రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినప్పటికీ ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం, సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పాలకులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలోనే పరిష్కారం



రైల్వేస్టేషన్ మార్గంలో ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ నుంచి అక్బర్‌నగర్ కమాన్ వరకు రూ.40లక్షల నిధులతో ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తికానుంది. అంతర్గత కాలనీల్లో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంది. అయినప్పటికీ సాంకేతికపరమైన అంశాలు పరిగణలోకి తీసుకోవాల్సి రావడంతో ప్రధాన డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి అంతర్గత డ్రైనేజీలను కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.
– కన్నూరి సతీశ్‌కుమార్, కార్పొరేటర్

రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బంది



మా కాలనీ నుంచి రైల్వేస్టేషన్‌కు ప్రధాన రహదారిపై నడిచి వెళ్లాలంటే రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు వాహనాల రాకపోకలతో తుంపర్ల మాదిరిగా పైన పడుతుండడంతో ఇబ్బందిగా ఉంది. ఎవరి ఇంట్లోనైనా శుభకార్యం, ఆలయంలో పూజలకు వెళ్లాలంటే వాహనం ఉంటేనే జాగ్రత్తగా వెళ్లే పరిస్థితి. లేదంటే మనపై డ్రైనేజీ నీరు పడే అవకాశం ఉంది.
– వాణి, గృహిణి

పాలకులు దృష్టిసారించాలి



కల్లు డిపో వీధిలో ఉన్న గృహాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు ప్రధాన డ్రైనేజీలో చేరే విధంగా ప్రణాళికాబద్ధంగా అంతర్గత డ్రైనేజీ నిర్మించాలి. కాలనీలో నడవాలంటే డ్రైనేజీ నీటిని దాటుకుంటూ అడుగులేయాల్సి వస్తోంది. ఎంతో మంచిగా కట్టుకున్న ఇంటికి ఎవరైనా అతిథులు వచ్చినా కొంత అసౌకర్యానికి గురవుతున్నాం. దీనిపై పాలకులు దృష్టిసారించాలి.
– వరలక్ష్మి, కాలనీ మహిళ